
సాక్షి సంగారెడ్డి
మంగళవారం । 13 । ఆగస్టు । 2024



ఆగుతూ.. 'సాగు'తూ
వరి సాగుకు సంబంధించి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. నాట్లు ఆగుతూ.. సాగుతూ కొనసాగుతున్నాయి.
వివరాలు 8లో ▸



నిర్లక్ష్యం ఖరీదు..
మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్ రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.
వివరాలు 8లో ▸



డాక్టర్లపై దాడులు..
లేడీ డాక్టర్లపై దాడులను నిరసిస్తూ పట్టణంలో సోమవారం రాత్రి వైద్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఎంపీకి రాష్ట్రపతి శుభాకాంక్షలు

నారాయణఖేడ్: ఈనెల 8న జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ జన్మదినం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి శుభాకాంక్షల లేఖ అందింది. సోమవారం ఎంపీ ఇంటికి ఈ లెటర్ వచ్చింది. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రపతి లేఖ పంపడంపై షెట్కార్ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

మురుగునీరు తొలగింపునకు చర్యలు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఫాగింగ్ చేపట్టకపోవడంతో పాటు మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతుండడంపై సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'ఇదేనా స్వచ్ఛదనం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మురికి నీటిని తొలిగించి ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శి నాగరాజును ఆదేశించారు. దీంతో సిబ్బంది ద్వారా మురుగునీరు లేకుండా చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దీంతో గ్రామంలో మురికి నీరు నిలువకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడం వంటి పనులను చేపట్టారు.

సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు శేషాద్రి

పటాన్‌చెరు టౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు టైం స్కేల్ ప్రకటించాలని ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు శేషాద్రి డిమాండ్ చేశారు. సోమవారం సమగ్ర శిక్ష రాష్ట్ర జాక్ పిలుపు మేరకు సమగ్ర శిక్షలో విధులు నిర్వహించి మృతి చెందిన వారికి ఎంఈఓ కార్యాలయం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 22 రోజులు దీక్ష చేసినా పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులు ఉమ, సరిత, సంతోష, భాస్కర్, సాయి, యాదగిరి, సుకన్య, భాగ్య పాల్గొన్నారు.

చెడు స్నేహాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి టౌన్ : విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ సూచించారు. సోమవారం పట్టణంలోని మాస్టర్ డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి త్వరగా స్థిరపడాలని తెలిపారు. చట్టాలపై అవగాహన పెంచుకొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేతకీలో శ్రావణ పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. శ్రావణమాసం రెండో సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్లో గంటల తరబడి వేచి ఉన్నారు. స్వామివారికి ప్రత్యేక బిల్వార్చన చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



గర్భగుడిలో పూజలు అందుకుంటున్న పార్వతీ పరమేశ్వరులు

46 కొత్త పంచాయతీలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏర్పాటు
- గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం
- ప్రస్తుతం పంచాయతీల సంఖ్య 1,615
- కసరత్తు మరూ చేసిన కలెక్టర్లు



అక్కన్నపేట గ్రామం

సాక్షి, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలో మరో 46 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. 'స్థానిక' ఎన్నికల కసరత్తు ప్రారంభమైన నేపథ్యంలో నూతన ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. 2018లో కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారు. తర్వాత పలు గ్రామాల నుంచి డిమాండ్లు రావడంతో ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించారు. అధికారులు పరిశీలించి ఏర్పాటుకు గెజిట్ విడుదల చేశారు.

1,661కు చేరనున్న జీపీలు

2018లో ప్రభుత్వం అనుబంధ గ్రామాలు, తండాలు పంచాయతీలుగా ఏర్పాటు చేసిన విషయం విదితమే. అయినా కొన్ని అనుబంధ గ్రామాల్లో కొత్త పంచాయతీల ఏర్పాటుకు డిమాండ్లు తెరపైకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో ఆయా గ్రామాల ప్రజల వినతుల మేరకు ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించారు. అప్పటి ప్రతిపాదనలకు ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. స్థానిక ఎన్నికల ప్రకటనకు ముందే గెజిట్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయా పంచాయతీల్లో నిర్వహణకు మార్గం సుగుమం కానుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 46 గ్రామ పంచాయతీలు పెరగనున్నాయి. సిద్దిపేటలో 15, సంగారెడ్డిలో 9, మెదక్ జిల్లాలో 22 కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 1,615 గ్రామ పంచాయతీలుండగా కొత్తవాటితో 1,661 కానున్నాయి. గెజిట్ ఆధారంగా ఆయా గ్రామ పంచాయతీల ఏర్పాటు చేస్తూ కలెక్టర్లు త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

ఉత్తర్వులు జారీ అయ్యాక..
గెజిట్ వచ్చింది... త్వరలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాక నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి.
– దేవకీ దేవి, డీపీఓ

వార్డుల విభజన...

అనుబంధ గ్రామాలు వేరుపడి పంచాయతీలుగా మారడంతో అక్కడి వార్డుల విభజన చేయనున్నారు. పంచాయతీలోని మొత్తం ఓటర్లను ఇంటినంబర్లతో సహా భౌగోళికంగా వార్డుల విభజన చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మార్చుతారా? లేదా పాత రిజర్వేషన్లను అనుసరించి ఎన్నికలు నిర్వహిస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

మెదక్ జిల్లాలో..

మండలం	కొత్త గ్రామ పంచాయతీ
చేగుంట	కిష్టాపూర్
మెదక్	తిమ్మక్కపల్లె, చిపురుదుబ్బతండా
హవేళీఘన్‌పూర్	ముత్తయికోట, దూప్‌సింగ్ తండా
పాపన్నపేట	కందిపల్లి, తమ్మాయిపల్లి జయపురం, పేర్‌పల్లి
రామాయంపేట	జామ్లాతండా
నిజాంపేట్	కాశ్మీపూర్‌తండా
శంకరంపేట(ఆర్)	రామాయంపల్లి, ప్యాటగడ్డ
నర్సాపూర్	రూప్‌సింగ్ తండా
కౌడిపల్లి	దర్మసాగర్‌గేట్ తండా, వెంకటాపూర్–జీ, కన్నారం పాంపల్లి, లింగంపల్లి, దేవులతండా
వెల్దుర్తి	పీరిల్లా, ఎల్కపల్లి

సంగారెడ్డి జిల్లాలో..

మండలం	కొత్త గ్రామ పంచాయతీ
సదాశివపేట	ముబారక్ తండా
అందోల్	కొండారెడ్డిపల్లి తండా
వట్‌పల్లి	లాక్యనాయక్ తండా
నారాయణఖేడ్	హనుమాన్ మందిర్ తండా లింగనాయక్‌పల్లి గుండుతండా
సిర్గాపూర్	పాత్యానాయక్ తండా
నాగల్‌గిద్ద	ఉమ్లా తండా శ్యామనాయక్ తండా

సిద్దిపేట జిల్లాలో..

మండలం	కొత్త గ్రామ పంచాయతీ
సిద్దిపేట రూరల్	బచ్చాయిపల్లి, నారాయణరావుపేట శేఖర్‌రావుపేట
చిన్నకోడూరు	ఎల్లమ్మజాలు, శంకరాయ కుంట కమ్మర్లపల్లి
నంగునూరు	సంతోష్‌నగర్
దౌల్తాబాద్	పోసాన్‌పల్లి
జగదేవ్‌పూర్	రమణనగర్
బెజ్జంకి	రామ్‌సాగర్
అక్కన్నపేట	కెప్టెన్ తండా హాతీరాంఅంబనాయక్ తండా శ్రీరాం తండా, చౌటకుంట తండా దాసు తండా సేవాలాల్ మహారాజ్ తండా

అర్జీలు అందించి.. ఆదుకోవాలని

'ప్రజావాణి'కి 86 దరఖాస్తులు

సంగారెడ్డి టౌన్ : తమ సమస్యలు విని న్యాయం చేయాలని పలువురు జిల్లా యంత్రాంగానికి దరఖాస్తులు అందించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ క్రాంతి అర్జీలు స్వీకరించారు. మొత్తం 86 దరఖాస్తులు రాగా, వాటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి, అధికారులు

సర్టిఫికెట్ల ఆధారంగా స్థలాలు ఇవ్వాలి



రాయికోడ్ మండలం పిపడ్ పల్లి గ్రామంలోని మహిళా సభ్యులకు 20 ఏళ్ల క్రితం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు కానీ.. స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. సర్టిఫికెట్ల ప్రకారం స్థలాలు పంపిణీ చేయాలని మహిళలు కోరారు.

రేషన్ కార్డు మంజూరు చేయాలి



రేషన్ కార్డు మంజూరు చేయాలని నాలుగేళ్ల నుంచి మండల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామానికి చెందిన సుప్రియ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



పటాన్‌చెరు మండలం ఆసమైలారం గ్రామంలో సువేన్ ఫార్మాసిల్క్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు వేతనాలు పెంచి, వారిని పర్మినెంట్ చేయాలని కోరారు.

ఇనాం పట్టాదారు సర్టిఫికెట్ అందజేయాలి



హత్నూర మండలం నాగారం గ్రామానికి చెందిన అబ్దుల్ రజాక్ ఇనాం పట్టా రద్దు చేసి సర్టిఫికెట్ అందజేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నానని తెలిపారు. పూర్తి డాక్యుమెంట్లు అందజేసినా పట్ట రద్దు సర్టిఫికెట్ ఇవ్వడం లేదని కలెక్టర్‌కు వివరించారు.

కెమికల్ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



హత్నూర మండలంలోని గుండ్ల మాచునూరు గ్రామానికి చెందిన బద్రేశ్ గ్రామంలోని చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల వల్ల ఇబ్బంది పడుతున్నామని మాస్కులతో నిరసన తెలిపి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 20ఏళ్లుగా రాత్రి పగలు తేడా లేకుండా విషపు గాలులు వదలడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, చాలాసార్లు అధికారులు పరిశ్రమలను హెచ్చరించినా స్పందన లేదని తెలిపారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

మున్సిపల్ కార్మికులకు రక్షణ కల్పించండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సంగారెడ్డి టౌన్ : మున్సిపాలిటీలలో పనిచేసే కార్మికులకు రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా నాయకులు మాణిక్యం, యాదగిరి డిమాండ్ చేశారు. కార్మికులపై దురుసుగా ప్రవర్తించినా, దాడి చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. చెత్త వేయొద్దన్నందుకు కార్మికుడిపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జహీరాబాద్ టౌన్ : ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జహీరాబాద్ ఏరియా కార్యదర్శి రాంచందర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో అనేక సమస్యలు తిష్ట వేశాయని తెలిపారు. పట్టణాభివృద్ధికి రూ.250 కోట్లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్‌బెడ్ రూంలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆర్డీఓ రాజుకు వినతి పత్రం ఇచ్చారు. మహిపాల్, రాజిరెడ్డి, సలీమొద్దీన్, తిరుపతి, నరేష్, బక్కన్న, శాంతమ్మ, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడుతాం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని పాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా వేసిన షెడ్లను సోమవారం ఎంఈఓ రాథోడ్‌తో కలిసి డీఈఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని పాఠశాల స్థలాన్ని కాపాడుతామని డీఈఓ తెలిపారు. గతంలో ఈ పాఠశాల స్థలం మాదని కొందరు అనడంతో ఈ పంచాయితీ కోర్టుకు వెళ్లింది. అయితే ఆ స్థలంలో పాఠశాలను యథాస్థితిగా కొనసాగించాలని తీర్పు వచ్చింది. అప్పటి కలెక్టర్ దగ్గర ఉండి కబ్జాకు గురి కాకుండా పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేయించారు. ఈ లోపుగా భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న భవనంలోకి పాఠశాల మార్చారు. అప్పటి నుంచి దీనిని ఎవరూ పట్టించుకోకపోవడంతో అందులో అక్రమ నిర్మాణాలు వెలిశాయి.



ఎంఈఓ రాథోడ్ తో కలిసి పాఠశాల స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

పంటల సర్వే పూర్తి చేయాలి : ఏడీఏ

రాయికోడ్(అందోల్) : వానాకాలం సీజనల్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాల నమోదు ప్రక్రియను ఈనెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని ఏడీఏ సత్యనారాయణ ఏఈఓలను ఆదేశించారు. రాయికోడ్‌లోని రైతువేదికలో రాయికోడ్, మునిపల్లి, వట్‌పల్లి మండలాల వ్యవసాయ శాఖ ఎంఏఓలు, ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగులో రైతులకు సలహాలు, సూచనలు చేయాలన్నారు. రుణమాఫీ కాని రైతుల నుంచి వచ్చే ఫిర్యాదుల వివరాలను ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా రైతుబీమా దరఖాస్తులను పరిశీలించారు. సమావేశంలో ఎంఏఓలు అభినాష్ వర్మ, శివకుమార్, మహేష్ చౌహాన్, ఏఈఓలు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని విన్నపం

సంగారెడ్డి : పట్టణంలోని పాత బస్టాండు వద్ద రూ.15 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కోరారు. సోమవారం మంత్రిని కలసి ఇందుకు సంబంధించిన ప్రతిపాదనల ప్రతిని అందజేశారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ.. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే చిరు వ్యాపారులకు ప్రయోజనకరంగా ఉంటుందని, ఆర్టీసీకి కూడా ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



కాంగ్రెస్‌లో చేరిన డీఆర్ఎస్ నాయకులు

హత్నూర(సంగారెడ్డి): పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన హత్నూరకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల నరేందర్‌తోపాటు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు పుట్ల చెరువు నరేందర్, పెంటయ్య, పండుగ ఆంజనేయులు, చెన్నారెడ్డి, నాగులు పాల్గొన్నారు.

అట్టహాసంగా తిరంగా ర్యాలీ

సంగారెడ్డి: పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఐబీ నుంచి జిల్లా కోర్టు వరకు ఈ యాత్ర కొనసాగింది. కార్యక్రమానికి రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు శ్రీదేవి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మాధురి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరు రాజశేఖర్ రెడ్డి, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

సంగారెడ్డి టౌన్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీస్ గౌరవ వందనం, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపికకు ప్రతిపాదనలు పంపాలన్నారు.

ఓపెన్ స్కూల్ విద్య ఓ వరం

కొండాపూర్(సంగారెడ్డి): చదువు మధ్యలో మానేసిన వారికి తిరిగి విద్యను కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్ వరంలాంటిదని కలెక్టర్ క్రాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ లో చదివినవారికి వచ్చే సర్టిఫికెట్ రెగ్యులర్ దానితో సమానంగా పనిచేస్తుందని తెలిపారు. అనంతరం డీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతేడాది జిల్లాలో 6210 అడ్మిషన్లు అయ్యాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం మరిన్ని ఎక్కువగా వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు అడ్మిషన్ గడువు సెప్టెంబర్ 10వ తేదీ వరకు ఉందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

తనిఖీలు విస్తృతం చేయాలి

సంగారెడ్డి టౌన్ : ఔషధ నియంత్రణ తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో డ్రగ్స్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లైసెన్సు లేకుండా మందుల అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశ్రామికవేత్తల నుంచి రెండు శాతం సమాజసేవకు నిధులు వసూలు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి పాల్గొన్నారు.

భూముల పరిరక్షణకు పోరాడుదాం

- అధైర్య పడొద్దు.. మీవెంట మేమున్నాం
- రచ్చబండలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ ఛైర్మన్ శివకుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): ఫార్మాసిటీ కంపెనీల నుంచి భూములను కాపాడుకునేందుకు పార్టీలకతీతంగా రైతులు, ప్రజలు పోరాటం చేయవలసిన అవరముందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ శివకుమార్ అన్నారు. మండల పరిధిలోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల పరిధిలోని భూముల్లో ఫార్మాకు భూసేకరణ చేపడుతున్న నేపథ్యంలో సోమవారం డప్పూర్‌లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీల ఏర్పాటుతో రైతులు భూములు కోల్పోయి రోడ్డునపడటమే కాక, ఈ ప్రాంతం పటాన్‌చెరువు మాదిరిగా కాలుష్యమయం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల జోలికి వస్తే తరిమికొట్టాలన్నారు. రైతులకు అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. అనంతరం రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో రవీందర్, నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రవి, మారుతి, కిరణ్ గౌడ్, సుభాష్ సేట్ పాల్గొన్నారు.



డప్పూర్‌లో నిర్వహించిన రచ్చబండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ప్రాణాలైనా ఇస్తాం.. భూములివ్వం

మా భూముల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని రైతులు, మహిళలు హెచ్చరించారు. జీవనాధారమైన భూములను కంపెనీలకు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రాణాలైన ఇస్తాం కానీ.. భూములను ఇవ్వమని వారు తెగేసి చెప్పారు.

ఫార్మాసిటీ ఏర్పాటు వద్దని వినతి

జహీరాబాద్: న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల పరిధిలో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేయొద్దని ఆర్డీఓ రాజును ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు కోరారు. ఈ మేరకు సోమవారం జహీరాబాద్ ఆర్డీఓ కార్యాలయానికి రైతులతో కలిసివచ్చి వినతి పత్రం ఇచ్చారు.



జహీరాబాద్‌లో నిర్వహిస్తున్న నిరసన ర్యాలీ

బంద్ ప్రశాంతం

జహీరాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరసిస్తూ హిందూ సంఘాల పిలుపు మేరకు సోమవారం జహీరాబాద్‌లో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు మూసివేశారు. పట్టణంలోని ఆర్యనగర్‌లోని శివాజీ చౌక్ నుంచి పస్తాపూర్ క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ, యువజన సంఘాల నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు. సీఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

కనీస వేతనం చెల్లించాలి



సభ్యత్వం నమోదు చేస్తున్న సురేశ్

చేగుంట(తూప్రాన్): కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో పని చేస్తున్న సిబ్బందికి కనీస వేతనం వర్తింపజేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాతు సురేశ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వడియారం, పొలంపల్లి పాఠశాలలతోపాటు చేగుంట ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో తపస్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీబీవీ పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్ఓలు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది మెరిట్‌కమ్ రోస్టర్‌తో ఎంపికైనా ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, రావుల వెంకటేశ్, అమరేశ్వరీ, బక్కప్ప, శ్రీనివాస్, పద్మ, సునీత, సిద్దిరాములు, వసంత తదితరులు పాల్గొన్నారు.

తలనీలాల టెండర్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించాలి



మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించే తలనీలాల టెండర్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని సీపీఎం మండల పార్టీ అధ్యక్షుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయంలో గతేడాది తలనీలాలు పోగుచేసుకునే హక్కుకు టెండర్ నిర్వహించగా రూ.86 లక్షల ఆదాయం ఆలయానికి వచ్చిందన్నారు. ఈసారి తక్కువ ధరకు టెండర్ దక్కించుకునేందుకు స్థానికంగా ఉండే ఓ కాంగ్రెస్ నాయకుడు ఆలయ అధికారులను తప్పుదోవ పట్టించి, ఇతరులు టెండర్‌లో పాల్గొనకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ టెండర్ ప్రక్రియలో ఆలయ ఈవో పారదర్శంగా వ్యవహరించాలని సూచించారు. ఆలయంలో జరిగే టెండర్లలో ఎన్నడూ లేని విధంగా గోల్‌మాల్ జరుగుతుందని వీటిపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు త్వరలోనే ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బోనాల్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుమ్మరి స్వామి(41) ఆదివారం సాయంత్రం చేపలు పట్టేందుకు పోచమ్మ చెరువులోకి వెళ్లాడు. సోమవారం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు, స్థానికులు వెతికారు. సోమవారం సాయంత్రం చెరువు వద్ద చెప్పులు బట్టలు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చెరువులో గాలించగా స్వామి మృతదేహం లభించింది. మృతుడు స్వామి భార్య నిర్మల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

కొబ్బరి చెట్టుపై నుంచి పడి వ్యక్తి

జహీరాబాద్ టౌన్: కొబ్బరి చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన జహీరాబాద్ పట్టణంలోని నాగులకట్ట ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన హొలియదాసరి దశరత్(32) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. పట్టణంలోని హమాలీ కాలనీలో ఉంటున్న కొబ్బరి బొండాల వ్యాపారి వద్ద చెట్టుకు కాయలు కోసేందుకు వెళ్తుంటాడు. నాగులకట్ట ప్రాంతంలో గాదెరాజు పొలంలో చెట్టు ఎక్కి కొబ్బరి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్
SERVICES
■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-270]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించవ ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆగుతూ.. సాగుతూ

జిల్లాలో వరి సాగుపై భిన్న పరిస్థితులు

- రిజర్వాయర్ల మీద ఆధారపడి రైతులు ముందడుగు
- ప్రారంభమైన కాల్వల ద్వారా నీటి విడుదల ప్రక్రియ
- మళ్లీ నాట్లు మొదలుపెట్టిన అన్నదాతలు
- 2 లక్షల పైచిలుకు ఎకరాలు దాటిన సాగు
- మరింతగా పెరగొచ్చని వ్యవసాయశాఖ అంచనా



గజ్వేల్ మండలం అక్కారం పంపుహౌస్ నుంచి కొండపోచమ్మసాగర్‌కు విడుదలవుతున్న నీళ్లు

జిల్లాలో వరి సాగుకు సంబంధించి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. నాట్లు ఆగుతూ.. సాగుతూ ఉన్నాయి. భారీ వర్షాల్లేక నిన్నటి మొన్నటి వరకు వరి సాగు ఆపేద్దామనుకున్న రైతులు రిజర్వాయర్లకు గోదావరి జలాల రాకతో ఆశావహ దృక్పథంతో ముందడుగు వేస్తున్నారు. కాల్వలకు నీళ్లు వదిలి.. చెరువు, కుంటలను నింపుతారనే ఆశతో నాట్లను జోరుగా వేస్తున్నారు. ఇప్పటికే సాగు 2 లక్షల పైచిలుకు ఎకరాలు దాటింది. మరింత పెరగొచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

– గజ్వేల్

జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి మొత్తంగా 5.50 లక్షల పైచిలుకు ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తాయని భావిస్తే.. సీజన్ అరంభం నుంచి 45 రోజులకు పైగా వర్షాలు పత్తా లేకపోవడంతో పత్తి, మొక్కజొన్న విత్తనాలు సరిగా మొలకెత్తలేదు. ఈ క్రమంలోనే మళ్లీ సాధారణ వర్షాలు మొదలై నల్ల రేగడి భూముల్లో సాగు చేసిన పత్తి కొంత రికవరీ అవుతుంది. చెలక నేలల్లో పూర్తిగా దెబ్బతింది. మొక్కజొన్న కూడా కొంత కోలుకుంది. మొత్తానికి పత్తి 94,326 ఎకరాలకుపైగా, మొక్కజొన్న 21,334వేల ఎకరాల్లో, కంది 4,456 ఎకరాల్లో ఇతర పంటలు మరో 15 వేల ఎకరాల్లో సాగులోకి వచ్చాయి. వరి పరిస్థితి సైతం ఇదేరకంగా తయారయ్యింది.

తక్కువ వర్షపాతం ప్రభావం

నిజానికి ప్రతీ ఏటా ఈపాటికే వరి సాగు 3.50 లక్షల ఎకరాలను దాటేది. గతేడాది ఆగస్టు నెలాఖరు వరకు 3.70 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యింది. కానీ ఈసారి భారీ వర్షాల్లేని కారణంగా ఇంకా డైలమా కొనసాగుతుంది. జిల్లాలో జూన్ నెలకు సంబంధించి 104.9 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతానికి 141.3 మిల్లీ మీటర్లు, జూలై నెలలో 187.1 మిల్లీమీటర్ల సాధారణ వర్షాపాతానికి 199.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తాజాగా ఆగస్టు నెల వచ్చేసరికి 172.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి ఇప్పటివరకు 37 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. జిల్లాలోని రాయపోల్, మర్కూక్, వర్గల్, ములుగు, జగదేవ్‌పూర్, కొమురవెల్లి, చేర్యాల మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా మిగిలిన 19 మండలాల్లో రెండు, మూడు మండలాల్లో అధిక వర్షపాతం మినహా మిగితా చోట్లా సాధారణ వర్షపాతమే నమోదైంది.

గోదావరి జలాల రాకతో ఆశలు

కొద్ది రోజులుగా జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లకు గోదావరి జలాల రాక ప్రారంభమవడంతో రైతుల్లో ఆశావహ దృక్పథం ఏర్పడింది. కాల్వలకు నీటి విడుదల ప్రారంభమయ్యే అవకాశముండటం, చెరువులు, కుంటలు నింపే అవకాశం కలగడంతో వరి సాగు ఆపేద్దామనుకున్న రైతులంతా.. సాగుపై దృష్టి సారించారు. ఫలితంగా జిల్లాలో ఇంకా వరి నాట్లు సాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో వరి సాగు 2,04,493 ఎకరాలకు చేరుకోగా కొద్ది రోజుల్లోనే మరింతగా పెరగనుందని వ్యవసాయశాఖ భావిస్తుంది.

కాల్వల ద్వారా నీటిని విడుదల

కాళేశ్వరంలో భాగంగా సిద్దిపేట జిల్లాలో 3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రంగనాయకసాగర్, 50 టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్నసాగర్, మరో 15 టీఎంసీ సామర్థ్యమున్న కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లు ఇక్కడి సాగు, తాగునీటి అవసరాలకు ప్రధాన ఆధారంగా మారాయి. దీంతోపాటు పరోక్షంగా మరెన్నో లక్షల ఎకరాల భూముల్లో భూగర్భ జలమట్టం పెరిగి భారీగా ప్రయోజనం కలుగుతుంది. కానీ మేడిగడ్డ ఘటన తర్వాత నీటి ఎత్తిపోతల నిలిచిపోయి జిల్లాలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో నీటిమట్టం పూర్తిగా పడిపోయే దశకు చేరుకున్న దశలో ప్రస్తుతం నీటి పంపింగ్ మొదలవడం, మల్లన్నసాగర్‌లోనూ కొండపోచమ్మసాగర్‌లో నీటి నిల్వ క్రమంగా పెరుగుతూ ఉండటంతో కొన్ని చోట్ల కాల్వల ద్వారా నీటిని విడుదల చేసే ప్రక్రియ ప్రారంభమైంది. అంతే కాకుండా చెరువులు, కుంటలను సైతం నింపే అవకాశం కలిగింది. దీనివల్ల వరి సాగు పెరుగుతోంది.

నీళ్లు వదలడంతో సాగు చేసిన



రెండు ఎకరాల్లో వరి సాగు చేద్దామని నారు పోసిన. కానీ వర్షాలు సరిగా పడటం లేదు. అందుకని వరి సాగు చేయొద్దని అనుకున్న. కానీ కొండపోచమ్మసాగర్ కాల్వ నుంచి నీళ్లు వదులుతుండ్రు. అందుకని నాటు వేసిన. చాలా మంది రైతులు ఇలాగే చేస్తున్నారు.

– దావరి ఐలేని, రైతు, యూసుఫ్‌ఖాన్‌పల్లి, మర్కూక్ మండలం

3 లక్షల ఎకరాలకు పైగానే..



జిల్లాలోని రిజర్వాయర్లలోకి నీళ్లు రావడంతో వరి సాగు పెరిగే అవకాశం కలిగింది. కాల్వలకు నీళ్లు విడుదలు చేస్తున్నారు. చెరువులు, కుంటలు నిండే అవకాశం ఉంది. దీనివల్ల వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. సాగు 3 లక్షల ఎకరాలకుపైగా చేరుకునే అవకాశముంది.

– మహేశ్, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి

పట్టపగలే రూ.10 లక్షలు చోరీ

- రోడ్డుపై నిలిపిన కారులో నుంచి ఎత్తుకెళ్లిన దొంగలు
- జోగిపేట పోలీస్‌స్టేషన్ సమీపంలో ఘటన



పగిలిన కారు అద్దాలు

జోగిపేట(అందోల్): పట్టపగలే కారులో భారీ ఎత్తున నగదు చోరీ ఘటన జోగిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జోగిపేట ట్రాన్స్‌కో రిటైర్ ఏడీ రవీందర్‌రెడ్డి తన కుమారుడు సాయికిరణ్‌కు చెందిన చెక్కును డ్రా చేసుకొని ఓ కవర్‌లో పెట్టుకున్నాడు. ఆ కవర్‌ను తన స్విఫ్ట్ కారులోని ఎడమవైపు సీటులో పెట్టి వాసవీనగర్‌లోని ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో పోలీస్‌స్టేషన్ ముందు గేట్‌కు దగ్గరలో కారు నిలిపి రోడ్డుకు అవతల ఉన్న బాలాజీ స్వీట్ హౌస్‌లో స్వీట్ కొనడానికి వెళ్లాడు. ఐదు నిమిషాల్లో కారు వద్దకు వచ్చి చూసేసరికి డోర్ అద్దాలు పగులగొట్టి ఉన్నాయి. అందులోని రూ.10 లక్షలు కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సీసీ పుటేజీలు పరిశీలన

మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఘటన విషయం తెలుసుకున్న సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ పాండు వేర్వేరుగా ఆయా ప్రాంతాల్లోని వ్యాపార సంస్థల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. సీఐ బ్యాంకు వెళ్లి పుటేజీని పరిశీలించి బాధితుడు రవీందర్‌రెడ్డితో జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ దగ్గరలోని సులభ్‌కాంప్లెక్స్ నిర్వాహకుడు, ఆటో డ్రైవర్లను విచారించారు. నిందితులను పట్టుకునేందుకు విచారణ జరుపుతామని పోలీసులు తెలిపారు.

హాస్టల్ నుంచి తప్పిపోయిన విద్యార్థి

సంగారెడ్డి బస్టాండ్‌లో ప్రత్యక్షం

శివ్వంపేట(నర్సాపూర్): హాస్టల్ నుంచి విద్యార్థి తప్పిపోవడంతో సిబ్బంది ఆందోళనకు గురైన ఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండల గోగ్లూర్ తండాకు చెందిన కార్తీక్‌ని తల్లిదండ్రులు శివ్వంపేట ఎస్టీ హాస్టల్‌లో చేర్పించారు. హాస్టల్‌లో ఉంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం తల్లి సోని చూసేందుకు హాస్టల్‌కు రాగా ఇంటికొస్తానని కార్తీక్ మారాం చేశాడు. రాఖీ పండుగకు తీసుకెళ్తానని నచ్చజెప్పి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం హాస్టల్‌లో టిఫిన్ చేసిన కార్తీక్ తప్పిపోయాడు. గుర్తించిన సిబ్బంది పాఠశాలతోపాటు గ్రామ పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. వార్డెన్ యాదగిరి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు సంగారెడ్డికి చేరుకోగా బస్టాండ్‌లో కార్తీక్ కనిపించాడు. ఇంటికి వెళ్లేందుకు విద్యార్థి హాస్టల్ నుంచి వెళ్లిపోయి శివ్వంపేటలో సంగారెడ్డి బస్సు ఎక్కినట్లు వార్డెన్ యాదగిరి తెలిపారు.

బియ్యం పట్టివేత

వేర్వేరు చోట్ల 70 క్వింటాళ్లు



గజ్వేల్‌రూరల్: రేషన్ బియ్యంతో పోలీసులు

కొండపాక(గజ్వేల్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు కలిసి పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు... చిన్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన చింతల ఉపేందర్, తన్నీరు గణేశ్‌లు రేషన్ బియ్యాన్ని టాటా ఆటో, డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్నారని సమాచారం అందింది. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్న కిష్టాపూర్ శివారులో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా వీరు పట్టుబడ్డారు. 50 క్వింటాళ్ల బియ్యాన్ని వాహనాల్లో తరలిస్తుండగా స్వా. దీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

గజ్వేల్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. యాదాద్రి–భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం, మోహినిగడ్డ తండాకు చెందిన భుక్య నితిన్ ఆటోలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి చౌరస్తా వద్ద ఆటోను పట్టుకోగా 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైంది. బియ్యంతోపాటు ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

ములుగులో ఉరేసుకున్న యువకుడు

ములుగు(గజ్వేల్): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు మండలం కొత్తూరులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. కొత్తూరుకు చెందిన రామని రాము(26) మిషన్ భగీరథలో వర్కర్‌గా పని చేస్తుంటాడు. కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతూ ఉన్నాడు. సోమవారం ఉదయం 4 గంటల ప్రాంతంలో డ్యూటీకి వెళ్తున్నానని తల్లి దేవమ్మతో చెప్పి బయటకు వెళ్లాడు. ఉదయం 5 గంటల ప్రాంతంలో తల్లి బయటకు రాగా ఇంటి ముందు వాకిట్లో గల స్కూటీపైకి ఎక్కి పైకప్పుకు ఉరి వేసుకొని కనిపించాడు. కడుపునొప్పి భరించలేక రాము ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

పటాన్ చెరు టౌన్: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బీరంగూడ మంజీరా నగర్ కాలనీకి చెందిన ఈరన్న(55) రెండేళ్లుగా ఎలాంటి పని చేయకుండా తిరుగుతూ, మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 11వ తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికొచ్చాడు. భార్య భద్రమ్మ మద్యం సేవించి ఎందుకు వచ్చావని అడగడంతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా బీరంగూడ గుట్టపై లారీల అడ్డాకు సమీపంలో వేప చెట్టు ఉరి వేసుకొని కనిపించాడు. తన భర్త మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య భద్రమ్మ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నిర్లక్ష్యం ఖరీదు.. రెండు ప్రాణాలు బలి

- ద్విచక్రవాహనం, ఆపై లారీని ఢీకొట్టిన డీసీఎం
- ఇద్దరు యువకుల దుర్మరణం
- డీసీఎం డ్రైవర్ పరిస్థితి విషమం



నుజ్జునుజ్జయిన డీసీఎం, పక్కన లారీ



నవీన్ (ఫైల్)



వంశీ (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): మద్యం మత్తులో ఉన్న ఓ వాహనం డ్రైవర్ నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా రాయపోలు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. రాయపోలు మండలం ఎల్కల్‌కు చెందిన వడ్లకొండ రాకేశ్ డీసీఎం వాహనం (24) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లిలోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రం నుంచి మొక్కజొన్న పొత్తులు విజయవాడకు తరలించేందుకు కిరాయికి వెళ్లాడు. పొత్తులు లోడ్ చేసుకుని వడ్డేపల్లిలో తూకం వేయించేందుకు వచ్చి.. తిరిగి మాచిన్‌పల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చేగుంట–గజ్వేల్ రహదారిపై ఎదురుగా వస్తున్న మాచిన్‌పల్లికి చెందిన మామిండ్ల వంశీ(22), మామిండ్ల నవీన్ (18) ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే సమయంలో ద్విచక్రవాహనం వెనకాలే వస్తున్న రాజస్తాన్‌కు చెందిన మార్బుల్ లోడుతో వస్తున్న లారీని ఢీకొట్టిన డీసీఎం బోల్తాపడింది. దీంతో డీసీఎం నడుపుతున్న రాకేశ్ అందులో ఇరుక్కుపోయాడు. రోడ్డుపై వెళ్తున్న వారు పోలీసులకు, 108కి సమాచారం అందించారు. రాకేశ్‌ను స్థానికుల సహాయంతో వాహనం నుంచి తీసి గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో సమీపంలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మిన్నంటిన కుటుంబీకుల రోదనలు

ఈ రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాద ఛాయాన్ని నింపింది. మాచిన్‌పల్లికి చెందిన స్వామి, రామవ్వలకు ఒక్కగానొక్క కొడుకు వంశీ. ఇంటర్ వరకు చదివి తల్లిదండ్రులకు వ్యవసాయ పనులకు చేదోడుగా ఉంటున్నాడు. అలాగే యాదగిరి–లక్ష్మీల కొడుకు నవీన్ గజ్వేల్‌లో డిగ్రీ చదువుకుంటున్నాడు. ఇద్దరూ సోమవారం తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయం చేసి ప్రమాదానికి 10 నిమిషాల ముందే గజ్వేల్‌కు బయలుదేరి ప్రాణాలు కోల్పోయారు. చేతికందిన కొడుకులు మృతిచెందడంతో మృతుల తల్లిదండ్రుల రోదనలు కంటతడి పెట్టించాయి.

మల్లన్నసాగర్‌కు పంపింగ్

- 9.5 టీఎంసీల నీటిని నిల్వ
- 0.8 టీఎంసీలు కొండపోచమ్మకు తరలింపు



పంపింగ్ అవుతున్న గోదావరి జలాలు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాల పంపింగ్ నాలుగు మోటార్ల ద్వారా కొనసాగుతోంది. ఈ నెల 8న నీటి పంపింగ్‌ను ఎస్ఈ బస్వరాజ్ ప్రారంభించారు. సోమవారం నాటికి 1.8 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్లు ప్రాజెక్టు డీఈఈ చెన్ను శ్రీనివాస్ తెలిపారు. అందులో నుంచి 0.8 టీఎంసీల నీటిని కొంపోచమ్మ రిజర్వాయర్‌కు తరలించామన్నారు. నిన్నటితో మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో 9.5 టీఎంసీల నీటిని నిల్వ చేసినట్టు తెలిపారు. ఈ 18వ తేదీ వరకు నీటిని ఎత్తిపోసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి వరద నీటిని మల్లన్న సాగర్ రిజర్వాయర్‌కు పంపింగ్ జరుగుతుందన్నారు. ఆరు రోజుల్లో 4.5 టీఎంసీల నీటిని పంపింగ్ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మరో ఆరు రోజుల పాటు నీటిని ఎత్తిపోయాలని ఆదేశించినట్టు చెప్పారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలతో సంబంధం లేకుండా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వరద నీటిని తరలిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి వరద నీటిని మల్లన్న సాగర్‌కు తరలించే అవకాశముందన్నారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో సుమారు 15 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం

సిద్దిపేటరూరల్: ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి వేడుకల నిర్వహణపై చర్చించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ, మండల కార్యాలయాల్లో ఉదయం 8 గంటలకు, కలెక్టరేట్, జిల్లా అధికారుల కార్యాలయాల్లో ఉదయం 8:30 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు. ఉదయం 9. 30 గంటలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ముఖ్య అతిథితో జాతీయ జెండా ఆవిష్కరణ, స్వాతంత్ర వేడుకలను జిల్లా స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

రెస్టారెంట్‌లో తనిఖీలు



అపరిశుభ్రంగా ఆహార పదార్థాలు

సిద్దిపేటఅర్బన్: ఎఫ్ఎస్ఎస్ఏఐ యాప్ వీడియో టికెట్ నంబర్ పై ఫిర్యాదు అందడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు మండలంలోని పొన్నాల సమీపంలో గల టోల్‌గేట్ హోటల్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు మాట్లాడుతూ.. హోటల్ సమీపంలో వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లు హెయిర్ నెట్, గ్లౌజ్ లేకుండా ఫుడ్ హ్యాండర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. అదే విధంగా డస్ట్ బిన్లు మూతలు లేకుండా ఉన్నాయని పాక్షికంగా తయారు చేసిన ఆహార పదార్థాలు నేలపై ఉంచారని అవి కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ఫుడ్ హ్యాండ్లర్లు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందుబాటులో లేవని ఫుడ్ సేఫ్టీ పేర్కొన్నారు. హోటల్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశామని ఎఫ్ఎస్ 2006 చట్ట ప్రకారం కేసు నమోదు చేశామన్నారు.

ప్రకృతితో మమేకం.. తీజ్ ఉత్సవం

- శ్రావణమాసంలో వేడుకలు ప్రారంభం
- తొమ్మిది రోజులపాటు ఉపవాసాలు
- మట్టి, మొలకలకు గిరిపుత్రుల పూజలు



ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన తీజ్ పందిరి



తీజ్ బుట్టలతో యువతులు (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): బంజారాల సంప్రదాయాలు, పండుగలు అందరికంటే భిన్నంగా ఉంటాయి. ప్రతీ యేటా శ్రావణమాసంలో తీజ్ వేడుకలను నిర్వహిస్తారు. ప్రకృతితో మమేకమై మట్టిని, మొలకలను ఆరాధిస్తారు. బంజారా మహిళలు, యువతుల ఆటపాటలు, నృత్యాలు, డప్పులదరువు మధ్య భక్తిభావంతో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక ఉపవాసాలు ఉండి ఉత్సవాలు నిర్వహిస్తారు.

పెళ్లికాని యువతులకు ప్రత్యేకం..

బంజారా బతుకమ్మగా తీజ్ పండుగని చెప్పవచ్చు. బంజారాల సాంప్రదాయం ప్రకారం వివాహం కాని అమ్మాయిలు తండాలో ఎంతమంది ఉంటే అంతమంది తమ బుట్టలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరిపై ఉంచుతారు. యువతుల్లో ఒకరు తమ బృందానికి నాయకురాలిగా వ్యవహరిస్తారు. తొమ్మిది రోజులపాటు ఎంతో భక్తి శ్రద్ధలతో మూడు పూటలు నీరు పోస్తారు. ఈ నారు అత్యంత పవిత్రమైందని, దీనివల్ల శుభం జరుగుతుందని నమ్మకం. తీజ్ బుట్టలను పట్టుకొని తొమ్మిదో రోజున వరుసగా ఆడపిల్లలు నిమజ్జనానికి డప్పు చప్పుళ్లతో బయలుదేరుతారు. తీజ్ తమను వదిలేసి వెళ్లిపోతుందనే దు:ఖంతో ఆడపిల్లలు ఏడుస్తుంటే పెద్దలు, సోదరులు వారిని ఓదార్చుతారు. సోదరిమణుల ఆశీర్వాదం తీసుకుంటారు. తీజ్ ఉత్సవాల్లో ముఖ్యమైనది పులియాగెనో. దీనిని బంజారా మహిళలు అద్దాలు, గవ్వలు, పూసలతో చూడముచ్చటగా తయారు చేస్తారు.

నారుకు నీరు పోస్తాం..



తొమ్మిది రోజులపాటు ఎంతో భక్తి శ్రద్ధలతో మూడు పూటలు నీరు పోస్తాం. ఈ నారు అత్యంత పవిత్రమైంది. దీని వల్ల శుభం జరుగుతుందని నమ్మకం. అలాగే మంచి భర్త వస్తాడని నమ్ముతాం. పెళ్లికాని యువతులు అందరూ దీన్ని పాటిస్తారు.

– గుగులోతు నిఖిత, వంకాయతండా

తొమ్మిది రోజుల పండుగ



పెళ్లికాని యువతులకు తీజ్ తొమ్మిది రోజుల పండుగ. ప్రతిరోజు ఎంతో భక్తిశ్రద్ధతో పూజిస్తారు. ప్రస్తుతం గిరిజనుల ప్రతి పండుగకు పులియాగెనోను వాడుతున్నారు. కుమార్తెల వివాహంలో తల్లిదండ్రులు తప్పనిసరిగా పులియాగెనో ఇవ్వాల్సిందే.

– మాలోతు లక్ష్మీ, మాజీ ఎంపీపీ అక్కన్నపేట మండలం